ఎడతెరిపిలేని వాన

- నగరంలో పలు ప్రాంతాల్లో కూలిన చెట్లు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు
- బల్దియా ఆధ్వర్యంలో సహాయక చర్యలు ముమ్మరం
- పర్యవేక్షించిన మేయర్, కమిషనర్
- పలు గ్రామాల్లో మత్తడి దుంకుతున్న చెరువులు
- ఆనందంలో అన్నదాతలు

కార్పొరేషన్/ హుజూరాబాద్/ సైదాపూర్/ ఇల్లందకుంట/ చిగురుమామిడి/ శంకరపట్నం/ మానకొండూర్ రూరల్, జూలై 21: మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షానికి జనజీవనం స్తంభించింది. నగరంలోని అన్ని ప్రాంతాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురువడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోగా.. మరి కొన్ని చోట్ల రోడ్లపైకి నీరు చేరింది. అలాగే చైతన్యపురి, భగత్‌నగర్ ప్రాంతంలో చెట్లు విరిగిపడ్డాయి. భగత్‌నగర్ ప్రాంతంలో ఓ విద్యుత్ స్తంభం కూడా విరిగిపోయింది. చైతన్యపురిలో చెట్టు విరిగి అక్కడ నిలిపి ఉన్న కార్లపై పడడంతో స్వల్ప నష్టం జరిగింది. కాగా, నగరంలోని విద్యానగర్, రాంనగర్, శర్మనగర్, మంచిర్యాల చౌరస్తా, భగత్‌నగర్, రాంపూర్, బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. అలాగే నగరంలోని శివారు ప్రాంతంలోని రేకుర్తి, తీగలగుట్టపల్లి ప్రాంతాల్లోని పలు కాలనీల్లో మురుగు కాల్వల వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోగా ప్రజలు అవస్థలు పడుతున్నారు.

అప్రమత్తమైన నగరపాలక సంస్థ

నగరంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో నగరపాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. సమస్యలు తలెత్తిన చోట డీఆర్ఎఫ్

శంకరపట్నం: వరద నీటితో పారుతున్న కేశవపట్నం వాగు

భగత్‌నగర్‌లో విరిగిన విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

బృందాలతో తక్షణమే సహాయక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా చైతన్యపురిలో చెట్లు విరిగిపడడంతో వెంటనే స్పందించి వాటిని తొలగించారు. అలాగే భగత్‌నగర్‌లోనూ చెట్లు, విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో వెంటనే చర్యలు తీసుకున్నారు. రాంపూర్, బైపాస్‌రోడ్డు, రాంనగర్‌లో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోగా, ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీల ద్వారా నీరు సులువుగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. బైపాస్ రోడ్డులో సీసీ పైపులు వేయడంతో వర్షం నీరు వెళ్లే పరిస్థితి లేక పోవడంతో పైపులను తవ్వి కచ్చ కాల్వలను ఏర్పాటు చేశారు.

ప్రజల రక్షణే ధ్యేయం: మేయర్

నగరవాసులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రజలందరి రక్షణే ధ్యేయంగా తాము పని చేస్తున్నామని మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నుంచే మేయర్ నగరంలో పలు చోట్ల పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. 33వ డివిజన్ భగత్‌నగర్ వాటర్ ట్యాంకు సమీపంలో విద్యుత్ స్తంభం నేలకొరగడంతో నగరపాలక సంస్థ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి సరి చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థలో 9849906694 కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఎక్కడ ఇబ్బంది కలిగినా కాల్ సెంటర్‌కు సమాచారం అందించాలన్నారు. మూడు డీఆర్ఎఫ్ బృందాలతో ప్రత్యేక నోడల్ అధికారుల పర్యవేక్షణలో 64 మంది సిబ్బందితో నగరంలో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వర్షాలతో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎక్కడా ఇబ్బందులు రానివ్వం: కమిషనర్

నగరంలో వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు

చిగురుమామిడి: మొగిలిపాలెం–రేకొండ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

రాకుండా అని చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, చేపడుతున్న పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలిగినా వెంటనే కాల్ సెంటర్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమాల్లో డీఈలు వెంకటేశ్వర్లు, ఓం ప్రకాశ్, అయూబ్ ఖాన్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీహరి, నవీన్,

హుజూరాబాద్ : వరద నీటితో పట్టణ పరిధిలోని చిలుకవాగు

రాజు, ఎన్వీరాన్‌మెంట్ ఇంజినీర్ స్వామి, ఏఈలు గట్టు స్వామి, గఫూర్, పారిశుధ్య అధికారులు గట్టు శ్రీనివాస్, వెంకన్న, నర్సోత్తం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ డివిజన్‌లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో వాగులు ఒర్రెలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటల్లోకి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. హుజూరాబాద్‌లో 7.86 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పట్టణ సమీపంలోని చిలుకవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. రంగనాయకులగుట్టకు వెళ్లేదారిలో గల గుండ్లచెరువు వరద నీటితో కళకళలాడుతున్నది. మామిండ్లవాడ, బుడిగ జంగాల కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లల్లోకి వరద వచ్చింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో అన్నదాతలు సంతోషంగా ఉన్నారు. రెండు మూడ్రోజుల్లో వరి నాట్లు వేసేందుకు సమాయత్తమవుతున్నారు.

ఇల్లందకుంట మండలంలోని చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకున్నాయి. బోగంపాడు కొత్త చెరువు మత్తడి పడుతుండగా, సిరిసేడు, బుజూనూర్, మల్యాల, ఇల్లందకుంట, చిన్నకోమటిపల్లి, టేకుర్తి చెరువులకు జలకళ వచ్చింది. మల్యాల వాగులోని చెక్ డ్యాంలు అలుగుపడుతున్నాయి. చెరువులు, కుంటలకు జలకళ రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సైదాపూర్ మండలంలోని రాయికల్ జలపాతం వద్ద సందర్శకుల తాకిడితో సందడిగా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జెండా గుట్ట నుంచి వస్తున్న నీటి ప్రవాహం పర్యాటకులను ఆకర్షిస్తున్నది. కాగా, జలపాతం వద్దకు వెళ్లేందుకు రాయికల్ గ్రామం నుంచి రోడ్డు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకుల కోసం రహదారి నిర్మాణం చేపట్టాలని సింగిల్ విండో డైరెక్టర్ చాడ ప్రకాశ్‌రెడ్డి కోరారు.

చిగురుమామిడి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, ముదిమాణిక్యం, నవాబ్ పేట్, సుందరగిరి తదితర గ్రామాల్లో వరి పంటలు నీట మునిగాయి. కుంటలు, చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతున్నది. రేకొండ నుంచి మొగిలిపాలెం, ఎగ్లాస్‌పూర్ గ్రామాల మధ్యలో గల కల్వర్టుల పైనుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇందుర్తి–ఒగులాపూర్ మధ్య గల ఎల్లమ్మవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది.

శంకరపట్నం మండలం కేశవపట్నం నుంచి అర్కండ్ల వరకు వాగుపై నిర్మించిన చెక్ డ్యాంలు నిండి పారుతున్నాయి. ముత్తారం రామసముద్రం చెరువుతో పాటు కేశవపట్నం పెద్ద చెరువులు నిండి మత్తడి దుంకుతున్నాయి. లింగాపూర్, మెట్‌పల్లి, తదితర చెరువుల్లోకి వరద నీరు చేరుతున్నది. ఈ సీజన్‌లో ఆలస్యంగానైనా ఆశించిన మేర వర్షాలు కురుస్తుండడంతో రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మానకొండూర్ మండలంలోని పలు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. దేవంపల్లి ఊర చెరువు (పాల చెరువు), శ్రీనివాస్ నగర్‌లోని బర్లాం చెరువులు మత్తడి పడుతున్నాయి. ఆయా చోట్ల మత్స్యకారులు చేపలు పడుతున్నారు. దేవంపల్లి చెరువుతో పాటు ఈదులగట్టెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట వరద ప్రవహించడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మానకొండూర్ రూరల్: దేవంపల్లిలో మత్తడి దుంకుతున్న ఊర చెరువు

ఇల్లందకుంట: బోగంపాడులో మత్తడి పడుతున్న కొత్త చెరువు

రైతులను మభ్యపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

తెలంగాణచౌక్, జూలై 21: రైతులకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేసినట్లు గొప్పలు చెప్పుకొంటున్న రాష్ట్ర ప్రభుత్వం వారిని మభ్యపెడుతున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్రాభవనంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 18వ తేదీలోగా లక్ష రూపాయల రుణం తీసుకున్న రైతులందరి ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిందని, అయితే క్షేత్రస్థాయిలో 30 శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదని విమర్శించారు. షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మొత్తం 40లక్షల మంది రైతులు రుణాలు తీసుకోగా, కేవలం 10 లక్షల మందికే రుణమాఫీ ఎలా చేస్తారని ప్రశ్నించారు. రుణమాఫీ పేరుతో రైతు భరోసాకు ఎగనామం పెట్టాలని ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. ఎలాంటి కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలని, లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నగర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు

ఆలయంలో పూజలు చేస్తున్న రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డి

ఇల్లందకుంట, జూలై 21: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి ఆదివారం సందర్శించారు. ఆలయ ఈవో, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలుకగా, దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో కందుల సుధాకర్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో రూ.3 కోట్లతో సాలహారం,రాజగోపురం నిర్మించామని, దేవాలయంలో గ్రానైట్ వేయించామని తెలిపారు. దేవాలయానికి వచ్చే భక్తులకు వసతిగదులు, ఇతర పనుల కోసం నిధుల విడుదల కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఇక్కడ దేవాలయ సిబ్బంది రాజన్న, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

భూపాలపట్నం వాసికి ఉత్తమ రక్తదాత అవార్డు

చొప్పదండి, జూలై 21 : మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, లయన్స్ క్లబ్ చొప్పదండి వైస్ ప్రెసిడెంట్, బ్లడ్ డొనేషన్ మోటివేటర్ గొల్లపల్లి నరేశ్ ఉత్తమ రక్తదాత అవార్డు అందుకున్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు ప్రదానం చేశారు. కాగా, తనను అవార్డుకు ఎంపిక చేసినందుకు వైశ్య ఫెడరేషన్ కమిటీ సభ్యులకు గొల్లపల్లి నరేశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తక పరిచయం

కమాన్‌చౌరస్తా, జూలై 21: తెలంగాణ రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో సుంకురెడ్డి నారాయణ రెడ్డి రెండు పుస్తకాల పరిచయం, పరామర్శ సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సును కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ చరిత్ర గ్రంథస్తంలో ప్రతిభావంతుడైన ప్రామాణిక పరిశోధకుడిగా సుంకురెడ్డి నారాయణ రెడ్డి భావి పరిశోధకులకు చక్కని తోవ వేశారన్నారు. తెరవే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య స్వాగతం పలికారు.

నగరంలో బోనాల్లో పాల్గొన్న మేయర్

కమాన్‌చౌరస్తా, జూలై 21 : జిల్లా కేంద్రంలో ఆషాఢమాసం ఆదివారం సందర్భంగా వివిధ సంఘాలు, డివిజన్ల వారీగా పోచమ్మ, మైసమ్మ, పెద్దమ్మతల్లికి బోనాలు నిర్వహించారు. భగత్‌నగర్‌లోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో, కశ్మీర్ గడ్డలో రజక సంఘం ఆధ్వర్యంలో, మైసమ్మ చెట్టు వద్ద ఇలా వేర్వేరుగా బోనాలు తీసి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నగర మేయర్ వై సునీల్ రావు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొని మొక్కులు చెల్లించారు.

రెనే స్కైఫిట్ నెస్ క్లబ్ జిమ్ ప్రారంభం

జిమ్ ప్రారంభోత్సవంలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు

విద్యానగర్, జూలై 21: స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ప్రాంతంలో రెనే స్కైఫిట్ నెస్ క్లబ్ జిమ్‌ను ఆదివారం నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా జిమ్ చైర్మన్ రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ అధినేత, ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ, వైద్య సేవలతో పాటు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో ఈ హెల్త్ క్లబ్ ప్రారంభించామన్నారు. జిమ్ మేనేజింగ్ డైరెక్టర్, నేషనల్ బాడీ బిల్డింగ్ రిఫరీ, తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఇంతియాజ్ మాట్లాడుతూ, అత్యున్నత, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరికరాలను ఈ జిమ్‌లో ఏర్పాటు చేశామని, స్త్రీ, పురుషులకు ప్రత్యేక ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీ విజయ్ కుమార్, స్థానిక కార్పొరేటర్ వాల రమణారావు, ఎంఐఎం పట్టణాధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, 4వ డివిజన్ కార్పొరేటర్ అలీ, లయన్స్ క్లబ్ బాధ్యులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ఇనుగుర్తి రమేశ్, జగదీశ్వరాచారి, ముత్తోజు వేణు, కోట సత్యం, మేకల అరవింద్ రావుతో పాటు రెనే హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూలై 21: మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదినం సందర్భంగా సోమవారం స్థానిక ముకరంపురలోని చెన్నాడి హాస్పిటల్‌లో తలసేమియా వ్యాధిగ్రస్తులైన పిల్లల కోసం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చోరీకి యత్నించిన బాలుడి పట్టివేత

తెలంగాణచౌక్, జూలై 21: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం దొంగతనానికి యత్నించిన బాలుడిని (9) సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డులు కవిత, హరీశ్ పట్టుకున్నారు. హైదరాబాద్ బస్సు ఎక్కుతున్న ప్రయాణికుడి జేబులో నుంచి పర్సు తీస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం బాలుడిని వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు.

వృద్ధురాలికి అధికారుల భరోసా

లచ్చవను కరీంనగర్ దవాఖానకు తరలిస్తున్న అధికారులు

కరీంనగర్ రూరల్, జూలై 21: శిథిలావస్థలో ఉన్న ఇంట్లో దీనస్థితిలో జీవిస్తున్న వృద్ధురాలిని కలెక్టర్ ఆదేశాలతో అధికారులు జిల్లా ప్రధాన వైద్యశాలకు తరలించి భరోసా కల్పించారు. వివరాలు ఇవి.. మండలంలోని నగునూర్ గ్రామానికి చెందిన కోట లచ్చవ్వకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. ఇందులో ఇద్దరు కొడుకులు వేర్వేరు ప్రాంతాల్లో ఉంటుండగా, ఒకరు గ్రామంలోనే రేకుల షెడ్డులో నివసిస్తున్నాడు. మరో కొడుకు మరణించాడు. ఈ క్రమంలో లచ్చవ్వ ఆలనాపాలన చూసేవారు లేకపోవడంతో ఒంటరిగా పాత ఇంట్లో ఉంటున్నదని, ఇల్లు కూలిపోయే స్థితిలో ఉందని స్థానికులు కలెక్టర్‌కు సమాచారం అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వృద్ధురాలిని కరీంనగర్ రూరల్ తహసీల్దార్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కరీంనగర్ ప్రధాన వైద్యశాలకు తరలించారు. కార్యక్రమంలో ఆర్ఐ రజినీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

OLD AGE HOME

★ ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.

NT-325766-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

ప్రహరీ నిర్మాణ పనులను అడ్డుకుంటే చర్యలు

మానకొండూర్, జూలై 21: మండల కేంద్రంలోని కరీంనగర్–వరంగల్ రహదారి పక్కన వాటర్ ట్యాంకు సమీపంలోని ముస్లింలకు సంబంధించిన ఖబ్రస్థాన్ చుట్టూ చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులను అడ్డుకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని మానకొండూర్ మసీద్ కమిటీ సభ్యులు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మసీద్ కమిటీ మాజీ చైర్మన్ సయ్యద్ షర్ఫొద్దీన్, సభ్యులు సయ్యద్ సిరాజొద్దీన్ మాట్లాడారు. ఈద్గా స్థలాన్ని రెవెన్యూశాఖ అధికారులతో సర్వే చేయించగా దానికి హద్దులు నిర్ణయించారని తెలిపారు. ఖబ్రస్థాన్ ఇరుపక్కల ఉన్న భూముల యజమానుల అంగీకారంతోనే చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. మానకొండూర్ గడిమహల్‌కు చెందిన కొంత మంది ముస్లిం యువకులు మసీద్ కమిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిర్మాణ పనులకు అడ్డుతగులుతున్నారని చెప్పారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు, మత పెద్దలు మహ్మద్ గౌస్‌ఖాన్, మహ్మద్ గౌసొద్దీన్, మహ్మద్ అబ్దుల్ రజాక్, ఎండీ గౌసొద్దీన్, ఎండీ అల్తాఫ్‌హుస్సేన్, అజీజ్ మొహియొద్దీన్, ఎండీ అజారొద్దీన్, సయ్యద్ ముకరమొద్దీన్, ఖాజా ఫరిదొద్దీన్, ముసబ్ మోహియొద్దీన్ పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ రోడ్లకు మరమ్మతు చేయించాలి

తెలంగాణచౌక్, జూలై 21: నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులకే స్మార్ట్‌సిటీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, వెంటనే వాటికి మరమ్మతులు చేయించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని బోయవాడ, గంజ్, కట్టరాంపూర్, హనుమాన్ కాలనీలను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారంగా పనులు చేశారని విమర్శించారు. మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణతో పాటు రోజారాణి, దేవేంద్ర పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

శంకరపట్నం/ కొత్తపల్లి, జూలై 21: శంకరపట్నం మండలం కన్నాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996–97లో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం గొల్లపల్లి శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో, కొత్తపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (హా)కు చెందిన పూర్వ విద్యార్థులు (2003–04 పదో తరగతి బ్యాచ్) స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఆడిపాడి సందడి చేశారు. విద్య నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం విందు భోజనాలు ఆరగించారు. సాయంత్రం ఒకరికొకరు వీడ్కోలు తీసుకుని బరువెక్కిన హృదయాలతో ఇంటి దారి పట్టారు.

శంకరపట్నం: కన్నాపూర్ పాఠశాలలో చదివిన 1996–97 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

'రైతు బీమా'కు దరఖాస్తు చేసుకోవాలి

తిమ్మాపూర్, జూలై 21: రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏవో సురేందర్, నుస్తులాపూర్ క్లస్టర్ ఏఈవో అమరగాని స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 28లోగా పట్టా అయి పాస్‌బుక్ వచ్చిన రైతులు ఈ నెల 30లోగా ఏఈవోలను కలిసి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డుతో రైతువేదికల్లో ఆగస్టు 5లోగా సంప్రదించాలన్నారు.

పొంచిఉన్న వరద ప్రమాదం

ఇస్తారిపల్లి వద్ద తెగిపోవడానికి సిద్ధంగా లోలెవల్ బ్రిడ్జి

గంగాధర, జూలై 21: గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి, నారాయణపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్డు వద్ద వరద ప్రమాదం పొంచి ఉంది. ప్రతి ఏడాది భారీ వర్షాలు కురిసిన సమయంలో నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇస్తారిపల్లి వద్ద లోలెవల్ బ్రిడ్జి తెగిపోతూ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతుండడంతో గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అలాగే గంగాధర–పెగడపల్లి రహదారిలో లక్ష్మీదేవిపల్లి లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కాగా, రెండు చోట్ల అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తూ చేతులు దులుపుకొంటుండడంతో సమస్య మళ్లీ మొదటికి వస్తున్నది. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా రెండు చోట్ల మళ్లీ సమస్య వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా కాకుండా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

చొప్పదండి ఎస్ఐగా జీ అనూష

చొప్పదండి, జూలై 21: చొప్పదండి ఎస్ఐగా జీ అనూష ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రామడుగు ఎస్ఐగా పని చేసి, అనంతరం రామగుండం కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లిన ఆమె ఇటీవల తిరిగి కరీంనగర్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

పాముకాటుతో యువతి మృతి

సైదాపూర్, జూలై 21: పాముకాటుకు గురైన నల్లాని తండాకు చెందిన ఓ యువతి దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్ఐ ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నల్లానితండాకు గ్రామానికి చెందిన శిరీష (21) ఈనెల 16న వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా పాము కాటువేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె తండ్రి బర్మావత్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నారాయణపూర్ రిజర్వాయర్ పరిశీలన

గంగాధర, జూలై 21: భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా నారాయణపూర్ రిజర్వాయర్‌ను తహసీల్దార్ రమేశ్‌బాబు ఆదివారం పరిశీలించారు. రిజర్వాయర్ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎస్‌బీఐ సంబురాలు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూలై 21: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అధికారులు ఎస్ఎంఈ సంబురాలను ఆదివారం స్థానిక శ్వేత హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎంఈ వినియోగదారులకు ఉన్న అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జీఎం పీసీ బార్కర్, ఆర్ఎం పోలంకి ఘన్‌శ్యామ్, రామ్‌సెక్ ఏజీఎం వరదరాజు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగరావు, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల ఎస్ఎంఈలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- గురువులకు సత్కారం

కమాన్‌చౌరస్తా/ తెలంగాణచౌక్/ చొప్పదండి/ కరీంనగర్‌రూరల్/ శంకరపట్నం, జూలై 21 : గురు వ్యాస పూర్ణిమను పురస్కరించుకుని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయడంతోపాటు గురువులను సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. పండితులు, గురువుల నుంచి మంత్రోపదేశాలు స్వీకరించారు. నగరంలోని సాయినగర్ విజయగణపతి సాయిబాబా, భాగ్యనగర్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయినగర్‌లో షిర్డీ సాయి భక్త భజన మండలి ఆధ్వర్యంలో గురూజీ నర్సింగ రావు ఆధ్వర్యంలో అనేకమంది భక్తులు సాయి దీక్షలను తీసుకోగా, భక్త భజన మండలి గౌరవాధ్యక్షుడు నలమాచు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 24 గంటల పాటు అఖండ నామ జపాన్ని నిర్వహించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని కుల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ జీఎస్ ఆనంద్ ఆధ్వర్యంలో స్థానిక పంచముఖ హనుమాన్ ఆలయంలో పంచముఖ హనుమాన్ పీఠాధిపతి పరబ్రహ్మానందగిరి స్వామికి పాద పూజ చేసి ఘనంగా సన్మానించారు. కిసాన్ నగర్‌లోని శ్రీసత్యసాయిబాబా ఆలయంలో శ్రీసత్యసాయి సేవాసంస్థల ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పాల్తేపు లింగమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చొప్పదండిలోని సాయిబాబా దేవాలయంలో సాయి మహిళా సేవా సమితి బృందం ఆధ్వర్యంలో సాయి చాలీసా, హనుమాన్ సాయి పారాయణాలు చేశారు. అలాగే జ్ఞాన సరస్వతీ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో ఆషాఢ మాసం శాకాంబరీ ఉత్సవాల్లో భాగంగా ఆలయ ధర్మాధికారి, వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని 54 రకాల కూరగాయల మాలలతో అలంకరించారు. పౌర్ణమి సందర్భంగా వ్యాసమహర్షికి ఫల పంచామృతాభిషేకం చేశారు. అలాగే చండీహోమం, సహస్ర దీపాలంకరణ, అమ్మవారికి పల్లకీ సేవ, ఊయల సేవ పూజలు నిర్వహించారు. శంకరపట్నం మండలం కేశవపట్నం హనుమాన్ ఆలయం, కన్నాపూర్ అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గీతాపారాయణం నిర్వహించారు. హనుమాన్ ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తనుకు ఓంకారం, బ్రహ్మ విద్యాశ్రమ అధ్యక్షుడు కే రాజయ్య, కనకయ్య, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

వీణవంక–నర్సింగాపూర్ గ్రామాల మధ్య ప్రమాదకరంగా 20 మోరీల రోడ్డు

వీణవంక–నర్సింగాపూర్ గ్రామాల మధ్య ఇరవై మోరీల వద్ద నిర్మించిన రోడ్డు వరద తాకిడికి గురికావడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కరీంనగర్– జమ్మికుంట రోడ్డు విస్తరణలో భాగంగా వీణవంక–నర్సింగాపూర్ గ్రామాల మధ్య 20 మోరీల వద్ద బ్రిడ్జి నిర్మించడానికి కాంట్రాక్టర్ రోడ్డు తీసివేసి, తాత్కాలిక రహదారి నిర్మించారు. ఆరు నెలలుగా రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద తాకిడి పెరుగడంతో 20 మోరీల వద్ద రోడ్డుకు గండిపడే ప్రమాదం ఉండడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని మండల ప్రజలతో పాటు ప్రయాణికులు కోరుతున్నారు. *- వీణవంక, జూలై 21*